# న్యూట (ర్) స్

రచన:
"శశితేజ్"

వసంతం పుష్పించిన సుందర నందన వనంలా ఉంది కాలేజి ఆవరణం. రంగుల్లో ఇన్ని రకా లుండవంటూ రకరకాల వోణిలలో, మోడ్రన్ డ్రస్సుల్లో .... మందగమన జితరాజ మరాళుల్లా నడిచిపోతున్నారు అమ్మాయిలు. యవ్వనం తెచ్చిన సౌకుమార్యం, సహజ సౌందర్యం శరీరంలో ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. ప్రకృతి చాల విచిత్రమైనది. యవ్వన ఛాయలు ప్రవేశించే సరికి ఆడా, మగకి తమ మధ్య ఉన్న వ్యత్యాసం ఆకర్షణ తెలిసి వస్తాయి. అందుకే ప్రతి క్రియలోనూ, నడవడిక లోనూ తమ ప్రత్యేకతని ప్రదర్శించాలని ఇరువురూ శక్త్యానుసారం ప్రయత్నిస్తుంటారు. ఉదాహరణకి అమ్మాయిలు, అబ్బాయిలు కనపడగానే పైట సర్దుకోవడం, కొంచెం, కొంచెం - ఇష్టం వున్న వ్యక్తి కనిపిస్తే అనవసరంగా నవ్వుతూ ఆమె స్నేహితురాళ్ళతో సంభాషించడం చేస్తారు. అంతమాత్రం చేత వారి గుణశీలాదులు చాల అపవిత్రమైనవని తలపోస్తే అంతకు మించిన పొరపాటు ఉండదు. అసలు విషయానికి సూటిగా వచ్చేద్దాం. చెప్పేది కాస్త ముందుది వెనకైనా సర్దుకోండి దయచేసి. ఎందు కంటే నా అనుభవానికి వచ్చిన విషయం చెప్పుతున్న Passion లో రాస్తున్న అక్షరాలివి.

* * *

రశ్మి, మీనాక్షి కూడా క్లాస్‌లోకి వెళ్ళిపోయారు. ఇక నా ఆలోచనల పురి విప్పుతాను. అదిగో .... ఆ కనిపిస్తున్న కారిడార్ దగ్గరే జరిగిన సంఘటన! ఆ సంఘటనలు యిప్పుడు సవివరంగా 'టెలిపతిక్' లాంగ్వేజ్‌లో మీకు చెబుతున్నా! అంత ఇంటరెస్టింగ్‌గా లేకపోయినా జాగ్రత్తగా విని ఆ పైన మీరెలా సమాధాన పరచుకుంటారో అది మీ పైనే ఆధారపడి వుంటుంది. ఆ రోజు మంగళవారం. సమయం పది గంటలు కావొస్తోంది. కాలేజి ఆవరణం అప్పటికే చాల ప్రచారం జరిగిపోయింది కాలేజిలో! 'ఇది నిజమేనా? అయితే నాకూ ఒకసారి ఆ పత్రిక యివ్వవూ?' అంటూ చాల మంది అడుగుతున్నారు. నాకు ఆనందించాలో, విచారించాలో అర్థం కావట్లేదు. నే రాసిన కథ ఒకటి ఈ మధ్య ఓ పత్రికలో వచ్చింది, దాంట్లో 'ఇద్దరు కాలేజి అమ్మాయిల ప్రస్తావన' వచ్చింది, ఏం రాశాడో చూద్దాం అనే ఎక్సైట్‌మెంట్‌లో ప్రతి ఒక్కరు ఆసక్తిగా అడుగుతున్నారు. మొదట దీని విషయం తెలిసింది క్లోజ్ ఫ్రెండ్ అరవింద్‌కి మాత్రమే!

ఈ వార్తని బి. బి. సి. లో అతడు ప్రసారం చేస్తాడని నాకేం తెలుసు ....?

రశ్మి, మీనాక్షి అంటే కాలేజిలో అందరికీ తెలుసు. వాళ్ళంటే అబ్బాయిల కెంత యిష్టమో - అమ్మాయిల కంత అసూయ, అయిష్టమూనూ!

అలాంటి పబ్లిసిటీ గల వాళ్ళపై ఏం రాశానో చూద్దామని ప్రతి ఒక్కరి కుతూహలం. ఎట్టకేలకు తప్పించుకో లేక మ్యాగజైన్ ఇవ్వక తప్పింది కాదు!

చదివి మురళి అన్నాడు: "ఇది రశ్మి వాళ్ళకి చూపెట్టకు. అలా చేస్తే బావుండదు" అని.

అది అర్థింపో, బెదిరింపో అర్థం కాలేదు. దానికి సమాధానంగా అరవింద్ అన్నాడు: "చూపెడితే భయమేమిటి? వాళ్ళు అడిగితే కాని జిరాక్స్ కాపీ ఒకటి యిస్తాం" అని.

ఏమనాలో తెలీక నవ్వి వూరుకున్నా. నాలోనూ ఆత్రుత, జిజ్ఞాస పెరగసాగాయి. అసలు వాళ్ళు ఇది చూస్తే ఎలా ఫీలవుతారో చూద్దామని. ఏదో పనిమీద రశ్మి, మీనాక్షి స్టాఫ్ రూమ్‌లో నుండి వస్తూండగా "హలో రశ్మి! ఒక నిమిషం ...." అన్నాను.

"ఏమిటి?" అడిగింది ఆమె.

"మీరు ఆ మ్యాగజైన్ కావాలని పాపారావుతో అన్నారట! తీసుకుని చదివి యివ్వండి" అన్నాను మృదువుగా. ఏం సమాధానం యివ్వకుండా బుక్ తీసుకుని కొంచెం దూరంగా వెళ్ళి వరండాపైన బాసింపట్టు వేసుకుని చదవ సాగింది రశ్మి. మీనాక్షి మాత్రం తనకి ఇష్టం లేనట్టు ఏదో క్లాస్ బుక్ తీసుకుని శ్రద్ధగా చదువుకుంటోంది.

ఆ మొహంలో ఎలాంటి ఫీలింగ్ లేదు. ఓ ఏడు నిమిషాల్లో కథ చదివేసి నాకు యివ్వడానికి లేచి వస్తుండగా రశ్మికి ఎదురువెళ్ళి నేనే తీసుకుంటూ అన్నాను "ఎలా వుంది?" అని.

మొదట ఈ వార్త విని "అప్‌సెట్ అయ్యాం." అంది రశ్మి.

"మీ పేర్లు కథలో వాడినందుకు మరోలా అనుకోకండి. నాకు మీ పట్ల ఎలాంటి దురుద్దేశ్యం లేదు. అసలు ఆవగాహనే లేదు. మీకు బాధ కలిగిస్తే 'సారీ'!" అన్నాను.



"సారీ ఎందుకు లెండి!" అంది మీనాక్షి.

ఆ కంఠంలో Depression లీలగా తొంగి చూసింది.

"ప్లీజ్ డోంట్ థింక్ మోర్ యాజ్ యూ థాట్."

"ఈ స్టోరీకి ఆధారం మీకు తెలిసిన ఏవైనా సంఘటనలా?" అడిగింది మీనాక్షి.

"అలాంటిదేం లేదు. కల్పనే!"

"కల్పన అయితే కావచ్చు. కాని సమాజంలో నుండి తీసుకున్న పాత్రల్నే అయినా ఎదుటివారికి బాధ కలిగించే రీతిగా మలచకూడదని నా భావన!" అంది మీనాక్షి.

"మీరు చెప్పినది చాల వరకు నిజమే! సమాజాన్ని ప్రతిబింబించే, ప్రతిస్పందించే రచనలు చేయవచ్చునేమో - కాని అంతమాత్రం చేత అవి వ్యక్తులకి బాధ కలిగించేలా ఉండకూడదనే మీ అభిప్రాయంతో ఏకీభవిస్తాను" అన్నాను.

"థాంక్స్ ఫర్ యువర్ అండర్‌స్టాండింగ్!" అంది రశ్మి.

ఆ తర్వాత 'హోటల్ షిర్డీ'లో కాఫీ త్రాగుతుండగా మిత్ర బృందంలో ఎవరో అడిగారు.

"రశ్మి వాళ్ళకి కథ చూపించావుగా....ఏమన్నారు?" అని.

"మీకు ఓ చిన్న ప్రశ్న, చర్యకి తగిన ప్రతి చర్య జరుగుతుందని సిద్ధాంతీకరించిన శాస్త్రవేత్త ఎవరో తెలుసా?"

"న్యూటన్." అన్నాడొక మిత్రుడు.

ఆ మహాశయుణ్ణి ఎల్లప్పుడు గుర్తుంచుకోవాలి మనం." అని లేచాను.

## పరలోక సుఖం!!

★

మనిషి జీవితమే
ఒక రంగుల రాట్నం.
రంగుల రాట్నంలాగే
మనిషి జీవితం
ఊహించినది జరగనపుడే
దేవుడి ప్రతిభ.
ఊహించినది జరిగినపుడు
మానవుడు తనకు తాను
గొప్పగా తలుస్తాడు,
వెనువెంటనే
దేవుణ్ణి మరచిపోతాడు.

* * *

కులమత భేదం లేదని చెబుతున్న
ఈ దేశం, కొన్ని కులాలకు ప్రత్యేక
సదుపాయాలు కల్పిస్తూ,
స్వార్థం చూపుతుంది.
ఎవరిది న్యాయం?
ఎవరిది అన్యాయం?

* * *

జీవితమంటే ఏమిటి?
ఎన్ని జన్మల పాపఫలమో
ఈ మానవజన్మ
ఎన్ని జన్మల పుణ్యఫలమో
ఆ పక్షుల జన్మ
మానవుడు పడుతున్న
యాతన చెప్ప నలవి కానిది.
మానవులంతా సమానమే!
కాని, ఒకరికంటే ఒకరు గొప్ప
అదేమిటో వింత!